క్లుప్తంగా

పంటలను పరిశీలించిన వ్యవసాయ శాస్త్రవేత్తలు



మంగళగిరి: మొక్క జొన్న, జొన్న, పెసర పంటలకు కీటకాలు సోకకుండా జాగ్రత్తలు తీసుకుని అధికదిగుబడులు సాధించవచ్చని లాం శాస్త్రవేత్తలు లీలారాణి, రామాంజనేయులు తెలిపారు. నగర పరిధిలోని పెదవడ్లపూడిలో పంటలను శుక్రవారం శాస్త్రవేత్తల బృందం పరిశీలించింది. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి శైలజ పాల్గొన్నారు.

దేవాంగులకు రాజకీయ ప్రాధాన్యం ఇవ్వాలి

మంగళగిరి: రానున్న ఎన్నికలలో అన్ని రాజకీయ పార్టీలు రాష్ట్రంలో దేవాంగులకు మూడు ఎమ్మెల్యే సీట్లు, ఒక ఎంపీ సీటు కేటాయించాలని దేవాంగల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఐబీఎన్ భవనం ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలలో దేవాంగల ఓట్లు 10 నుంచి 15వేల వరకు ఉన్నాయన్నారు. 20 లక్షలకుపైగా ఓట్లు ఉన్న దేవాంగులకు అధిక సీట్లు కెటాయించిన పార్టీకి తన మద్దతు ఉంటుందన్నారు. ప్రధానంగా చీరాల నియోజకవర్గంలో 40 వేల ఓట్లు ఉన్న దేవాంగలకు రాజకీయ పార్టీలు సీటు కేటాయించి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాజమండ్రి రూరల్, పుట్టపర్తి, హిందూపురం స్థానాలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కర్ల నాగరాజు, పుచ్చల రామకృష్ణ, బల్ల వెంకటరమణ, బీరక ప్రసాద్, వేమన దుర్గారావు, కాలేపు సత్యనారాయణ, కుర్మా రాహుల్, మేరాసు అరుణ బాబు, అల్లక నమశ్శివాయ, ఆనెం ఆనంద్, యర్ర నాగమల్లేశ్వరి పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు క్షయవ్యాధిపై అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుగ్గిరాల మండల టీబీ సూపర్‌వైజర్ డాక్టర్ పి.రవికుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడుతూ మార్చి 24న ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని అన్నారు. క్షయవ్యాధి లేని సమాజం కోసం ప్రతి ఒక్క విద్యార్థి కృషి చేయాలని పిలుపునిచ్చారు.


లక్ష్యంతో చదవాలి



మాట్లాడుతున్న విజయభాస్కర్

తాడికొండ: తాడికొండలోని ఎస్‌వీవీ ఉన్నత పాఠశాలను శుక్రవారం సమగ్ర శిక్షా అభియాన్ జాయింట్ డైరెక్టర్ బెజ్జం విజయభాస్కర్ సందర్శించారు. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన తాను స్వగ్రామమైన బడేపురం వెళ్లి, అనంతరం పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు చక్కని సందేశాన్ని అందించారు. చదువు ద్వారానే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దేవరాజు, సీనియర్ ఉపాధ్యాయులు ఎస్.వి.రమణయ్య పాల్గొన్నారు.

80 కిలోల గంజాయి స్వాధీనం



మంగళగిరి: నగర పరిధిలోని జాతీయరహదారిపై తనిఖీలు చేపట్టిన సెబ్ పోలీసులు 80 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. సెబ్ డీఎస్పీ ఎం. వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపిన వివరాలు.. కాజ టోల్‌గేట్ వద్ద తనిఖీలు నిర్వహిస్తుండగా రెండు కార్లలో అనుమానంతో తనిఖీ నిర్వహించగా గంజాయి లభించినట్లు తెలిపారు. గంజాయి తరలిస్తున్న 4 గురు నిందితులను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి 80 కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసి కోర్టుకు తరలించగా కోర్టు రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు. తిరుపతికి చెందిన మన్నెం బత్తయ్య, పసుపులేటి గిరిబాబు, ఎట్టి కుప్పం మునిబాలిరెడ్డి, పాకాల రాజశేఖర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

రేపు సినీ నటి పూర్ణిమకు సత్కారం

పాత గుంటూరు: రాజాగారి తోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు శత జయంతిని పురస్కరించుకుని ఆదివారం 'దొరకునా ఇటువంటి సేవ' పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు శ్రీ ఆలాపన కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా వెంకటేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో విభావరి అనంతరం సినీ నటి పూర్ణిమకు అక్కినేని నాగేశ్వరరావు శతజయంతి పురస్కారం ప్రదానం చేసి సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలి

పార్టీ సమన్వయకర్త గంజి చిరంజీవి

మంగళగిరి: రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీ విజయానికి సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కృషి చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి కోరారు. పట్టణంలోని టిప్పర్లబజార్‌లోని కల్యాణమండపంలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో చిరంజీవి పాటు ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ పరిశీలకుడు రేపాల శ్రీనివాసరావు, పార్టీ నగర అధ్యక్షుడు దొంతిరెడ్డి వేమారెడ్డి, పార్టీ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు చిల్లపల్లి మోహనరావు హాజరయ్యారు. చిరంజీవి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం రాష్ట్రంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయన్నారు. కన్వీనర్లు, గృహసారథులు ఇంటింటికి వెళ్లి వారికి అందిన సంక్షేమ పథకాలను వివరించి అవే పథకాలు ఇంటి వద్దకే అందాలంటే మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించాలన్నారు. టీడీపీ ప్రభుత్వ పాలనలో చంద్రబాబు హామీలు ఇచ్చి ఎలా మోసం చేశారనేది తెలియజేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థల ద్వారా ఏ విధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఎలాంటి అవినీతికి తావు లేకుండా పథకాలను ఇంటికి పంపుతున్నారో చెప్పి రానున్న ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా చేసేందుకు ప్రచారం నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఆకురాతి రాజేష్, ఎండీ ఫిరోజ్, ఎం.సుధారాణి, గుండా మధు, సాలి ప్రశాంత్, గౌస్, చింతక్రింది సాయికుమార్, బేతపూడి నరసయ్య, గంజి ఆనంద్, ఊట్ల కళ్యాణ్, విజయ్, సాయికుమార్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి, వేదికపై ఎమ్మెల్సీ మురుగుడు తదితరులు



11వ వార్డులో పర్యటిస్తున్న గంజి చిరంజీవి

సంక్షేమ రథసారథి జగనన్న

మంగళగిరి: పెత్తందార్లను ఓడించి .. పేదల రాజ్యం తెచ్చుకునేందుకు ప్రజలంతా ఐకమత్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పిలుపునిచ్చారు. మంగళగిరి పట్టణంలోని 11వ వార్డులో శుక్రవారం గుడ్‌మార్నింగ్ మంగళగిరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వాలకు జగనన్న ప్రభుత్వానికి ఉన్న తేడాని వివరించడంతో పాటు ప్రస్తుతం ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలను తెలియజేసి రానున్న ఎన్నికలలో మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ పేదలకు అవసరమైన విద్య, వైద్యం నేడు అత్యంత ఖర్చుతో కూడుకున్నవని ఆ రెంటిని పేదలకు ఉచితంగా అందించినప్పుడే పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందడంతో సమాజం అభివృద్ధి చెందుతుందని భావించిన నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. విద్య వైద్య రంగాలలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి నేడు పేదలకు అండగా నిలిచారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, కురగంటి ఆదామ్, బేతపూడి నరసయ్య, కొల్లి శేషిరెడ్డి, తోట శ్రీనివాసరావు,రాజేష్, వందనం, దేవళ్ల సుబ్బారావు పాల్గొన్నారు.

ఎవరూ ఆందోళన చెందవద్దు

- రైల్వే స్థలాల నివాసదారులకు అండగా ఉంటాం
- వైఎస్సార్ సీపీ నేతలు హామీ

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో రైల్వే స్థలాల్లో నివాసముండే పేద ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు బుర్రముక్కు వేణుగోపాల సోమిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని కృష్ణాకెనాల్ జంక్షన్‌కు, తాడేపల్లి మెయిన్‌రోడ్డు మధ్య రైల్వే స్థలాల్లో ఉన్న ఇళ్లను తొలగిస్తామని రైల్వేశాఖ అధికారులు ప్రచారం చేయడం, పోలీస్ బెటాలియన్‌తో తొలగిస్తామని హెచ్చరించడంతో అక్కడి ప్రజలు ఆందోళన చెందారు. బాధితులను వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షులు వేణుగోపాల సోమిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ.డేవిడ్ రాజు, రూరల్ అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి బాధితులతో చర్చించారు. ఎంపీ విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకు వెళ్లామని, ఆయన స్పందించి రైల్వే శాఖ అధికారులతో సంప్రదింపులు చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ప్రకాష్, బి.అనిల్, బి.దాసు, కె.రాజశేఖరరెడ్డి, దామేష్‌రెడ్డి, బి.నాని పాల్గొన్నారు.

బాధితులకు వేమారెడ్డి పరామర్శ

మూడు రోజుల నుంచి రైల్వే స్థలాల్లో నివాసముంటున్న ఇళ్లను తొలగిస్తామని రైల్వేశాఖ అధికారులు భయభ్రాంతులకు గురిచేయడంతో శుక్రవారం వైఎస్సార్ సీపీ ఎంటీఎంసీ అధ్యక్షుడు దొంతిరెడి వేమారెడ్డి ముగ్గురోడ్డు, లంబాడీ పేట ప్రాంతాలను సందర్శించి వారికి ధైర్యాన్ని ఇచ్చారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో రైల్వే స్థలాల్లో నివసించే వారికి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మాజీ కౌన్సిలర్ సింకా గంగాధరరావు, మేకా అంజిరెడ్డి, యు.కల్యాణ్, ఎలీషా పాల్గొన్నారు.

ఆదాయ పన్నుపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ప్రేమ్‌కుమార్

తాడేపల్లిరూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో ఎంబీఏ విద్యార్థులకు ఆదాయపన్నుపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆదాయపన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ ప్రేమ్ కుమార్ హాజరై మాట్లాడుతూ ప్రభుత్వాలకు చెల్లించాల్సిన పన్నుల విధానం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా టీడీఎస్, దాని యొక్క లక్ష్యాలు, ఆదాయ శాఖ పరిధిలో ఉన్న పలు రకాల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ శివప్రసాద్ మాట్లాడుతూ ప్రజలు కట్టే ప్రతి రూపాయి దేశ ప్రగతికి ఉపయోగపడుతుందని అన్నారు. పాన్‌కార్డ్, టాన్ కార్డుల యొక్క ప్రాముఖ్యతను వివరించారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.హేమదివ్య, ఎంహెచ్‌ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ముఖ్యాంశాలను వివరించారు. అనంతరం ఆదాయ పన్ను శాఖ డెప్యూటీ కమిషనర్ ప్రేమ్‌కుమార్‌కు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎంబీఏ ఉప విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.బాలజీ పాల్గొన్నారు.

గ్రీన్ హౌస్ వాయువుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలి



సదస్సు ప్రారంభిస్తున్న రమణారెడ్డి

తాడేపల్లిరూరల్: గ్రీన్ హౌస్ వాయువుల ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయడమే లక్ష్యంగా పరిశోధనలు జరగాలని ఏపీ నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్.రమణారెడ్డి అన్నారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ రసాయనిక శాస్త్ర నాలుగో సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ భారత ప్రభుత్వం పంచామృత్ పథకంలో ఇంధన పునరుత్పాదక అంశం కూడా ఉందన్నారు. రానున్న కాలంలో హైడ్రోజన్, పంకాల ద్వారా విద్యుత్‌ను ఉత్పత్తి చేసే దిశగా కేంద్రం అడుగులు వేస్తోందన్నారు. గ్రీన్ గ్యాస్, గ్రీన్ హైడ్రోజన్ తదితర వాయువులతో కూడా విద్యుత్‌ను ఉత్పత్తి చేయడానికి కృషి జరుగుతుందని వివరించారు. ఓఎస్‌డీ ఎ.కార్తికేయ మాట్లాడుతూ గ్రీన్ హౌస్ వాయువులతో విద్యుత్ తయారీపైన ఎదురవుతున్న సవాళ్లపైన రసాయనిక విభాగం విస్తృత స్థాయిలో పరిశోధనలు చేస్తోందని పేర్కొన్నారు. బొగ్గుపులుసు వాయువుల విడుదల కారణంగా ఓజోన్ పొర ఇప్పటికే ప్రమాదకర స్థితిలో ఉందన్నారు. ఇప్పటికైనా ప్లాస్టిక్ రహిత సమాజం వైపు, సహజ వనరులతో విద్యుత్ తయారీకి శ్రీకారం చుట్టడం శుభ పరిణామం అని అన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రొ చాన్సలర్ డాక్టర్ కేఎస్ జగన్నాధరావు, ప్రొ వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, లైఫ్ సైన్స్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. బుచ్చినాయుడు, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, రసాయనిక శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, సదస్సు కన్వీనర్ డాక్టర్ కె. దీప్తి, కో కన్వీనర్ డాక్టర్ ఎం.నరేష్, సలహాదారు, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన



ఫిరంగిపురం: మండలంలోని హౌస్ గణేష్ గ్రామంలో ఉద్యాన పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా నెల్లూరు జిల్లా గుడ్లూరు మండలం చిన్ననాటురిపికి చెందిన డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధన విద్యార్థుల ఆధ్వర్యంలో పువ్వులు, కూరగాయ పంటలలో వచ్చే తెగుళ్లు వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ఉద్యాన సాంకేతిక పరిజ్ఞాన నమూనా రూపంలో ప్రదర్శించారు. వాటిని గురించి రైతులకు వివరించారు. గుంటూరు లాం ఫాం శాస్త్రవేత్తలు గిరిధర్, రజని, నాగలక్ష్మి, ఫణి కుమార్, అసోసియేట్ డీన్ విజయపద్మ, ప్రొఫెసర్ జ్యోతిర్మయి, మండల ఉద్యాన శాఖాధికారి శిరీష, సర్పంచ్ వి.వీరయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే బడ్జెట్‌ను వ్యతిరేకించండి

ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

తాడేపల్లిరూరల్: కేంద్రం ప్రవేశపెట్టిన వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసే బడ్జెట్‌ను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఏపీ రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరం జాతీయ రహదారి వద్ద ఏపీ రైతు సంఘం నాయకులు కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ రైతు సంఘం కార్యాలయం వద్ద నుంచి జాతీయ రహదారి వరకు ప్రదర్శన చేసి, కేంద్ర బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలో వచ్చిన తరువాత వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యం అయిందన్నారు. వ్యవసాయ రంగాన్ని దెబ్బతీసే విధంగా పార్లమెంట్‌లో మూడు నల్లచట్టాలను తీసుకు వచ్చి రైతులను మోసం చేశారని విమర్శించారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని నష్టపరిచే బడ్జెట్ ప్రవేశపెట్టడం దుర్మార్గమని అన్నారు. కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఏపీ రైతు సంఘం సీనియర్ నాయకులు వై. కేశవరావు, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి జొన్నా శివశంకరరావు, ఏపీ కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, రైతు సంఘం నాయకులు ఎ.గోపాల్, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు పల్లె కృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా హోసన్న మందిర ప్రతిష్టా మహోత్సవం

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత, మాజీ మంత్రి రావెల కిషోర్ హాజరు



ఆశీర్వచనాలు అందిస్తున్న హోసన్న మినిస్ట్రీ అధ్యక్షులు డాక్టర్ అబ్రహం, డాక్టర్ జాన్‌వెస్లి

రావెల(తాడికొండ): క్రీస్తు సేవలో నిత్యం ప్రార్థించే భక్తులకు ఆయన ఆదరణ ఎప్పుడూ ఉంటుందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే మంత్రి మేకతోటి సుచరిత, మాజీ మంత్రి రావెల కిషోర్‌బాబు అన్నారు. తాడికొండ మండలం రావెల గ్రామంలో శుక్రవారం హోసన్న నూతన మందిరం ప్రతిష్ట సందర్భంగా వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హోసన్న మందిరం దైవ సేవలో దేశ, విదేశాల్లో భక్తులకు మంచి దైవ సందేశం ఇస్తూ ముందుకు వెళుతున్నారన్నారు. బ్రదర్ హోసన్న ఈసేవను విస్తరించడంలో చేసిన కృషిని కొనియాడారు. అనంతరం హోసన్న మినిస్ట్రీస్ అధ్యక్షులు బ్రదర్ అబ్రహం, బ్రదర్ జాన్ వెస్లీలు దైవాశీర్వాచనాలు అందజేసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రావెలలో పలువురిని పరామర్శించిన ఎమ్మెల్యే సుచరిత తాడికొండ మండలం రావెల గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే సుచరిత గ్రామంలో పర్యటించారు. పలువురు కార్యకర్తల కుటుంబాలను పరామర్శించారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామ సర్పంచి రావెల శైలజ, నిడుముక్కల గ్రామ సర్పంచి మాదాసు రత్నకుమారి, యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, మాజీ వైస్ చైర్మన్ భీమవరపు బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపీపీ కొమ్మినేని రామచంద్రరావు, మాజీ సర్పంచ్ దేవరపల్లి చినపాములు, భీమవరపు ధర్మారెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వరరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ తాళ్ల శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ ఎండీయూపై దాడి

- నీ సంగతి చూస్తాం అంటూ బెదిరింపు
- పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదు

తాడేపల్లిరూరల్: మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ వ్యాన్ డిస్ట్రిబ్యూటర్‌పై దాడిచేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. వివరాలు.. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాలు.. చిర్రావూరు గ్రామానికి చెందిన మొండితోక రాజశేఖర్ డిగ్రీ వరకు చదువుకుని ప్రభుత్వం ఇంటింటికి రేషన్ అందించే వాహనం ద్వారా ఇంటింటికి తిరిగి రేషన్ అందజేస్తున్నాడు. వాటర్ ట్యాంక్ నుంచి బొడ్డురాయి సెంటర్‌లో 4,12 క్ల స్టర్లలో ముంగమూరి పద్మావతి, కుమార్ ఆంజనేయులు సమక్షంలో బియ్యాన్ని అందజేస్తున్నాడు. ఈ క్రమంలో అదే బజారులో నివాసముండే ధనేకుల ప్రమీల రాణి బయోమెట్రిక్ వలంటీర్ తీసుకుని 15 కేజీల బియ్యాన్ని ఇవ్వమన్నారు. ఈ క్రమంలో రేషన్ వాహనం నడిపే మొండితోక రాజశేఖర్ గత నెల మీ మనవరాలైన జాహ్నవి బయోమెట్రిక్ వేయకుండా బియ్యం తీసుకు వెళ్లారని ఆ డబ్బులు నేను కట్టాల్సి వచ్చిందని, ఆ 5 కేజీల బియ్యాన్ని ఈ నెల తగ్గించుకోమని ప్రమీల రాణికి సూచించాడు. రెండు నెలలు ఆగితే మీరూ ఉండరు, మీ వాహనాలు ఉండవు. గతంలో మా ఇళ్లముందు ఎలా చేతులు కట్టుకుని నిల్చునేవారో అలాగే చేతులు కట్టుకుని నిల్చుంటారంటూ దురుసుగా మాట్లాడింది. జరిగితే చూద్దాం నేను బియ్యం ఇవ్వను అని చెప్పగా ప్రమీలా రాణి భర్త రామ్ ప్రసాద్ మా దగ్గరకు వచ్చి కులం పేరుతో తిడుతూ మీ సంగతి త్వరలోనే తేలుస్తాం. ఏమనుకుంటున్నారు అంటూ దాడికి పాల్పడ్డాడు. రామ్‌ప్రసాద్‌తో పాటు అతడి కుటుంబ సభ్యులైన ధనేకుల అరుణ, శ్రీకాంత్, బండ్లమూడి సుజాత, ధనేకుల సీతామహాలక్ష్మి, హర్షవర్ధన్ చౌదరి, ధనేకుల గోపి, బొల్లు శ్రీనివాసరావు తదితరులు దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న వలంటీర్లు, కొంత మంది గ్రామస్తుల సహాయంతో అక్కడి నుంచి పోలీస్ స్టేషన్‌కు వచ్చామని, జరిగిన ఘటనపై విచారించి దళితుడినైన నాకు న్యాయం చేయాలని మొండితోక రాజశేఖర్ ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు. ఇలా ఉంటే ధనేకుల ప్రమీలారాణి, మొండితోక రాజశేఖర్ బియ్యం ఇస్తూ తన చేయి పట్టుకుని వేధించాడని, అడ్డు వచ్చిన శ్రీనివాసరావు అనే వ్యక్తిపై కూడా దాడి చేసి మీ సంగతి తేలుస్తానని అసభ్యంగా మాట్లాడినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

పట్టణ ప్రగతి యూనిట్ ప్రారంభం



విస్తరాకుల మిషన్‌ను ప్రారంభిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల్ కుమార్

తాడేపల్లిరూరల్: ప్రభుత్వం మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. దానిలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళలకు పలు వృత్తులపై శిక్షణ ఇచ్చి వారికి అవసరమైన మిషనరీని అందజేస్తోంది. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి పట్టణానికి చెందిన నీలవేణి గ్రూప్ సభ్యురాలు దండగల కోటమ్మకు పట్టణ ప్రగతి యూనిట్ కింద విస్తరాకుల మిషన్ ప్రభుత్వం అందజేసింది. విస్తరాకుల మిషన్‌ను కమిషనర్ నిర్మల్ కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే వారి కుటుంబాలు బాగుంటాయని, ప్రభుత్వం పలు రకాల పథకాలను మహిళలకు అందజేస్తోందని, సున్నా వడ్డీ రుణాలతో పాటు, పట్టణ ప్రగతి యూనిట్‌లో భాగంగా శిక్షణ ఇస్తోందని, మన ప్రాంతంలో నవంబర్ 20 నుంచి 24 వరకు ప్రగతి యూనిట్లపై మహిళలకు అవగాహన కల్పించారని, డోలాస్‌నగర్‌కు చెందిన దండగల కోటమ్మ విస్తరాకుల మిషన్ శిక్షణ తీసుకోవడంతో ఆమెకు ప్రభుత్వం ఎటువంటి వడ్డీ లేకుండా రెండు లక్షల 62 వేల రూపాయలతో మిషన్, అందుకు అవసరమైన ముడి సరుకు అందించారని, మహిళలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ పావని, సీఓలు పద్మ, హరణి పాల్గొన్నారు.

దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే మేడ్ లక్ష్యం

గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి రమణమూర్తి



మేడ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి రమణమూర్తి

తాడేపల్లిరూరల్: దళిత ఉద్యోగుల సమస్యల పరిష్కారమే 'మేడ్' లక్ష్యం కావాలని గిరిజన సంక్షేమ గురుకుల కార్యదర్శి రమణమూర్తి అన్నారు. శుక్రవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకులాల రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించి మేడ్ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం మేడ్ వ్యవస్థాపకులు శృంగారపాటి శ్యామ్ సుందర్ అధ్యక్షత నిర్వహించారు. రమణమూర్తి మాట్లాడుతూ దళిత ఉద్యోగులు ప్రభుత్వ విధులు సక్రమంగా నిర్వహిస్తూ సమస్యల పరిష్కారం కోసం పోరాడాలని అన్నారు. సంఘ వ్యవస్థాపకులు శృంగారపాటి శ్యామ్ సుందర్ మాట్లాడుతూ రానున్న రోజులలో ఇంకా మేడ్‌ను బలోపేతం చేసి ముందుకు సాగుదామన్నారు. దళిత ఉద్యోగుల సమస్యలపై అధికారులను కలసి వారి దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కారం చేయాల్సిందిగా కోరుదామన్నారు. అనంతరం మేడ్ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేడ్ డెప్యూటీ సెక్రటరి కె. రామమోహనరెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ కృష్ణంరాజు, విజయ, ప్రిన్సిపాల్ ఎం.శైలజ, ఎం.ఉమేష్ పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా కమలకుమారి

గుంటూరు మెడికల్: జీజీహెచ్ నాట్కో క్యాన్సర్ సెంటర్ గ్రేడ్–2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా చలవాది కమలకుమారి శుక్రవారం విధుల్లో చేరారు. ఆమె జీజీహెచ్‌లోని ప్రభుత్వ నర్సింగ్ స్కూలులో 1981–1984లో జనరల్ నర్సింగ్ మిడ్‌వైఫరీ (జీఎన్‌ఎం) కోర్సు అభ్యసించారు. ఇటీవల ప్రభుత్వం నూతనంగా నాట్కో క్యాన్సర్ సెంటర్‌కు 30 మంది స్టాఫ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులు మంజూరు చేసింది. నూతనంగా మంజూరైన నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులో విధుల్లో చేరిన కమలకుమారిని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, గ్రేడ్–1 నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశాసజని, నాట్కో క్యాన్సర్ సెంటర్ కో–ఆర్డినేటర్ యడ్లపాటి అశోక్‌కుమార్, పలువురు నర్సింగ్ సిబ్బంది అభినందించారు.

పింఛన్ అందజేత



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం, పెనుమూలికి చెందిన మహిళా వాలంటీర్ ప్రకాశం జిల్లా ఒంగోలు వెళ్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడికి పెన్షన్ అందజేసింది. పెనుమూలికి చెందిన షేక్ బురాన్ సాహెబ్ ఒంగోలులో బంధువుల ఇంటికి వెళ్లి అక్కడ అనారోగ్యంతో ఒంగోలులో ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించగా గుండెకు సంబంధించి శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఫిబ్రవరి 1వ తేదీ షేక్ బురాన్‌కు పెన్షన్ ఇవ్వడానికి వెళ్లిన బేతపూడి ప్రసన్నరాణికి బురాన్ సాహెబ్ ఆస్పత్రిలో ఉన్నాడన్న విషయం తెలియడంతో ఎంపీటీసీ ముస్తఫా సహాయంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న షేక్ బురాన్ సాహెబ్‌కు శుక్రవారం పెన్షన్ అందజేశారు.

ఆడుదాం ఆంధ్రలో నిడమర్రు ఖోఖో జట్టు



నిడమర్రు(మంగళగిరి): నగర పరిధిలోని నిడమర్రు ఖోఖో జట్టు ఆడుదాం ఆంధ్ర జట్టుకు జిల్లా స్థాయిలో ఉమెన్స్ ఖోఖోలో పాల్గొనేందుకు ఎంపికయినట్లు పీడీ రవి శుక్రవారం తెలిపారు. ఎంపికైన జట్టును హెచ్‌ఎం శివనాగేశ్వరరావుతో పాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.